# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-01-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభంకానున్నాయి  ఉదయం 11 గంటలకు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగిస్తారు.**

**2. ఆంధ్రప్రదేశ్‌లో 44 వేల 778 కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ సంస్థలు పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి ఆమోదం తెలిపింది.**

**3. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో ఈ రోజు నిర్వహించే వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవంలో ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబునాయుడు పాల్గొంటారు.**

**4. హైదరాబాద్‌లో పునర్నిర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి ఈరోజు భూమిపూజ చేయనున్నారు.**

**5. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువల ను సవరణ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.**

==========================

పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ఈ రోజు నుంచి ప్రారంభంకానున్నాయి. ఉదయం 11 గంటలకు ఉభయసభల సంయుక్త సమావేశంలో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు. ఆ తర్వాత 2024-25 ఆర్థిక సర్వేను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సభలో ప్రవేశ పెడతారు. రేపు కేంద్ర బడ్జెట్‌ను ఆమె సభకు సమర్పిస్తారు. నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రవేశపెట్టనుండటం వరుసగా ఇది ఎనిమిదోసారి. కాగా.. బడ్జెట్ సమావేశాలు రెండు విడతలుగా జరగనున్నాయి. తొలి విడత ఫిబ్రవరి 13వ తేదీ వరకూ, రెండో విడత మార్చి 10 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకూ జరుగుతాయి.

-------------------------

ఆంధ్రప్రదేశ్‌లో 44 వేల 778 కోట్ల రూపాయల పెట్టుబడులతో పరిశ్రమల ఏర్పాటుకు వివిధ సంస్థలు పంపిన ప్రతిపాదనలకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి..ఎస్ఐపీబీ ఆమోదం తెలిపింది. ఆ ప్రాజెక్టుల ద్వారా 19 వేల 580 మందికి ఉపాధి లభిస్తుందని ప్రభుత్వం తెలిపింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన ఎస్ఐపీబీ సమావేశం రాష్ట్ర సచివాలయంలో నిన్న జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక రంగంలో 20 శాతం వృద్ధి సాధించాలన్నదే లక్ష్యమని ముఖ్యమంత్రి తెలిపారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా పెనుగొండలో ముఖ్యమంత్రి  నారా చంద్రబాబు నాయుడు ఈ రోజు

పర్యటించనున్నారు. నేడు కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని ప్రభుత్వం అధికార కార్యక్రమంగా నిర్వహిస్తోంది. దీనికి ముఖ్యమంత్రి పాల్గొంటున్న నేపథ్యంలో భారీగా ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా అక్కడ జరిగే ప్రత్యేక పూజల్లో చంద్రబాబునాయుడు పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తారు.

---------------------------

ప్రజలకు అత్యాధునిక వైద్య సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో పునర్మించనున్న ఉస్మానియా ఆసుపత్రికి తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి భూమిపూజ చేయనున్నారు. ఉదయం 11.55 నిమిషాలకు జరిగే ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ముఖ్య అధికారులు హాజరవుతారు. 2 వేల పడకల సామర్థ్యంతో 32 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో ఈ ఆసుపత్రిని నిర్మించనున్నారు.

---------------------------

విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయబోమని, పునర్నిర్మిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామి మరోసారి స్పష్టం చేశారు. నిన్న ఉక్కు పరిశ్రమను పరిశీలించిన ఆయన అధికారులు, ఉక్కు కార్మిక ప్రతినిధులతో వేర్వేరుగా సమావేశమయ్యారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ. మరో 15 నుంచి 20 రోజుల్లో కార్యాచరణ ప్రణాళిక నిర్ణయిస్తామని కుమారస్వామి తెలిపారు. ఈ ఏడాది జూన్, జులై నాటికి ఉక్కు పరిశ్రమలోని మూడు బ్లాస్ట్‌ఫర్నేస్‌లు అందుబాటులోకి తెస్తామని.. కార్మికుల సమస్యలను మరో రెండు, మూడు నెలల్లో పరిష్కరిస్తామని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి వివరిస్తూ...

వాయిస్ 27 సెకన్స్

---------------------------

ఆచరణాత్మకమైన సాంకేతిక విద్యా విధానాన్ని అమలు చేయడంలో ప్రయివేటు పాఠశాలలు ముందుండాలని కేంద్ర గామీణాభివృద్ధి, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సూచించారు. గుంటూరులో నిన్న జరిగిన ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ నాలుగో వార్షికోత్సవ సమావేశంలో ఆయన మాటాడుతూ.. ఆధునిక విద్యాలయాలు విద్యార్థులకు సమగ్ర వికాసాన్ని అందిస్తున్నాయని తెలిపారు. సమాజ అభివృద్ధిలో పాఠశాలలు భాగమయ్యయని పెమ్మసాని చంద్రశేఖర్ వివరించారు.

---------------------------

రాష్ట్ర వ్యాప్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్ విలువల సవరణ చేస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మార్కెట్ విలువకు అనుగుణంగా రిజిస్ట్రేషన్ విలువలు సవరించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. రేపటి నుంచి సవరించిన విలువలు అమల్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కమిషనర్‌ను ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఆదేశించారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని చోట్ల రిజిస్ట్రేషన్ విలువల పెంపు, తగ్గించే అవకాశం ఉంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పురపాలకశాఖ ఉద్యోగులు, స్వచ్ఛాంధ్ర కమిషన్ సిబ్బందికి బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్‌పై అవగాహనా కార్యక్రమాన్ని విజయవాడలో నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ సంయుక్త సంచాలకులు రమాకాంత్ సాగర్ మాట్లాడుతూ... వేస్ట్ డిస్పోజల్ మేనేజ్‌మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా ఉపయోగించే వాహనాలు, పరికరాలు, పాటించవల సిన నియమాలపై అవగాహన

కలిగి ఉండాలని తెలిపారు. బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ నాణ్య తా పమాణాలను తప్పక పాటించాలని రమాకాంత్ సాగర్ సూచిస్తూ.

వాయిస్ ( 29 సెకన్స్ )

---------------------------

అనంతపురం జిల్లాలో ఈ ఏడాది లక్ష ఎకరాల్లో సూక్ష్మ సేద్యం అమలు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తోందని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఉరవకొండలో నిన్న జరిగిన సూక్ష్మ సేద్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ప్రతి రంగంలోనూ మార్పు చూపించే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచి 'తల్లికి వందనం', 'అన్నదాత సుఖీభవ' పథకాలను అమలు చేస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు.

---------------------------

పోలీస్ వ్యవస్థలోనూ కృత్రిమ మేధ..ఏఐ సాంకేతికతను విస్తృతంగా వినియోగిస్తామని ఆంధ్రప్రదేశ్ పోలీస్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ ద్వారకాతిరుమలరావు తెలిపారు. డీజీపీగా పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో, గుంటూరు జిల్లా మంగళగిరిలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో ద్వారకా తిరుమల రావు నిన్న పాత్రికేయులతో మాట్లాడారు. ఇప్పటికే విజయవాడ నగర కమిషనరేట్, ఏలూరు జిల్లా పరిధిలో ప్రయోగాత్మకంగా ఏఐని వినియోగించగా, అద్భుత ఫలితాలొచ్చాయని, వీటిని రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తామని ఆయన వెల్లడించారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ నుంచి భవిష్యత్తు వ్యాపారవేత్తలను తయారు చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ఉద్యోగ కల్పన, వ్యవస్థాపకాభివృద్ధి సంస్థ..సీడాప్ పని చేస్తోందని ఆ సంస్థ ఛైర్మన్ జి.దీపక్ రెడ్డి తెలిపారు. విజయవాడలోని కార్యాలయంలో నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రతి కుటుంబం నుంచి ఒక ఔత్సాహిక పారిశ్రామికవేత్త రావాలనే ఉద్దేశంతో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్..ఐఎస్‌బీతో ఒప్పందం చేసుకున్నామని చెప్పారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు కల్పించేందుకు సెంచూరియన్ విశ్వవిద్యాలయంతో మరో ఒప్పందం కుదుర్చుకున్నామని వెల్లడించారు. యువతకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించడంలో సీడాప్ భాగస్వామిగా ఉందని దీపక్ రెడ్డి తెలిపారు.

---------------------------

తెలంగాణాలో విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో ఆచార్యుల పదవీ విరమణ వయసును 60 నుంచి 65 సంవత్సరాలకు పెంచాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి ప్రభుత్వానికి ప్రతిపాదన సమర్పించింది. ఈ ప్రతిపాదనపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా గత రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

ఉత్తర్ ప్రదేశ్‌లోని ప్రయాగ్ రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లాలనుకునే తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ రెండు ప్రత్యేక బస్సులు నడపనుంది. మొదటి బస్సు వచ్చే నెల 11వ తేదీన తిరుపతి నుంచి, రెండో బస్సు 12వ తేదీన నెల్లూరు నుంచి బయలుదేరుతుందని సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.శేషగిరి ఒక ప్రకటనలో తెలిపారు.

======================